క్లుప్తంగా

శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు



హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం రేబల్లె గ్రామంలోని శ్రీ శారదా చంద్ర మౌళీశ్వర స్వామి దేవస్థానంలో శివలింగాన్ని సోమవారం సూర్యకిరణాలు తాకాయి. కల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా సూర్యోదయ సమయంలో పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండగా ఈ అరుదైన ఘటన చోటుచేసుకుంది.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

కోదాడ : పట్టణంలోని బాలాజీనగర్ ప్రభుత్వ పాఠశాలలో 1993– 94 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన భూక్యా గోవిందు ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తూ ఇటీవల ప్రమాదంలో మృతి చెందారు. నాడు అతనితో పాటు కలిసి చదువుకున్న తోటి స్నేహితులు విషయం తెలుసుకుని వాట్సాప్ గ్రూపుగా ఏర్పడి రూ. 50 వేలు సేకరించి సోమవారం గోవిందు కుటుంబానికి అందజేసి ఆసరాగా నిలిచారు. కార్యక్రమంలో రఘురాంసింగ్, బర్మావత్ రాజు, బర్మావత్ రఘు, అంజిరెడ్డి, శంకరాచారి, వెంకటేశ్వర్లు, రామబ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

పీవైఎల్ డివిజన్ కమిటీ ఎన్నిక



నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న సాగర్

మునగాల : యువకులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై యువత ఉద్యమించాలని ప్రగతిశీల యువజన సమాఖ్య (పీవైఎల్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నల్గొండ నాగయ్య, కునుకుంట్ల సైదులు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కొక్కిరేణిలో పీవైఎల్ కోదాడ డివిజన్ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా కోదాడ డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా కామళ్ల అనంతరామయ్య, ప్రధాన కార్యదర్శిగా సుందరయ్య, సహాయ కార్యదర్శిగా మురళి, ఉపాధ్యక్షుడిగా పొన్నం బ్రహ్మం, కోశాధికారిగా నరేష్‌తో పాటు ఐదుగురు సభ్యులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీతో పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందూరి సాగర్ ప్రమాణ స్వీకారం చేయించారు. పీవైఎల్ రాష్ట్ర నాయకుడు ధారావత్ రవి, సైదులు, నాగరాజు, కుమార్ పాల్గొన్నారు.


క్రీడా స్థలం పరిశీలన

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపల సింగారంలో తెలంగాణ క్రీడా స్థలం, బృహత్ పల్లె ప్రకృతి వనం స్థలాన్ని సోమవారం ఆర్డీఓ వెంకారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా స్థలం, బృహత్ పల్లె ప్రకృతి వనాలను ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ సుధా, సీనియర్ అసిస్టెంట్ అప్పారావు, కార్యదర్శి పెండెం నాగమణి, తదితరులున్నారు.

మహిళలకు రక్షణగా షీటీం

పాలకవీడు : మహిళల రక్షణకు షీ టీంలు సమర్థవంతంగా పని చేస్తున్నాయని ఎస్ఐ సైదులు అన్నారు. ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా షీ టీం అధికారులతో కలిసి మహిళలు, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ మహిళలు, చిన్నారుల భద్రత, పిల్లల అక్రమ రవాణా వంటి అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళా బృందంచే పాటల రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా షీ టీం ఏఎస్సై పాండునాయక్, పాఠశాల హెచ్ఎం బాలునాయక్, షీ టీం, పోలీస్ సిబ్బంది శివరాం, వెంకటేశ్వర్లు, ప్రేమ్‌కుమార్, రవి, జానీపాషా, కళా బృందం సభ్యులు యల్లయ్య, గోపయ్య, చారి, గురులింగం, నాగార్జున ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ చైర్మన్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నాగేశ్వరరావు

మునగాల : మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు నల్లపాటి నాగేశ్వరరావు కేక్ కట్ చేసి పాఠకులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి దేవబత్తిని లలితాదేవి, రీడర్స్ ఫోరం అధ్యక్షుడు గండు అంజయ్యగౌడ్, కమిటీ సభ్యులు, సిబ్బంది శ్రీనివాస్, గ్రామస్తులు గోపాల్‌రెడ్డి, పవన్, రవి, మల్లికార్జున్, మోహన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో మిషన్ భగీరథ నీరేదీ..

- తాగు నీటి కోసం ప్రజల తిప్పలు
- పట్టించుకోని అధికారులు

మోతె : వేసవి సమీపిస్తుండడంతో మండలంలోని పలు గ్రామాల్లో తాగు నీటి కష్టాలు మొదలయ్యాయి. గ్రామాల్లో పూర్తిస్థాయిలో తాగు నీరు లభించక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కాలం వచ్చిందంటే బోర్లు ఎండిపోవడం, వచ్చిరాని కరెంట్‌కు బోర్ల మోటార్లు కాలిపోవడంతో వ్యవసాయ బావుల వద్ద బిందెలతో నీళ్లు తెచ్చుకునే పరిస్థితి నెలకొటుంది. కాగా గత వారం రోజుల నుంచి గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో పలు గ్రామాల్లో చేతి పంపులు లేకపోవడంతో బోరు బావుల నుంచి బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్నారు. పలు గ్రామాల్లో ప్రజలు ప్రైవేటు వాటర్ ప్లాంట్ల నుంచి తాగు నీరు కొనుగోలు చేస్తున్నారు.



హుస్సేనాబాద్‌లో నిరుపయోగంగా ఓవర్‌హెడ్ ట్యాంక్

నల్లాలు బిగించారు కానీ..

పాలేరు రిజర్వాయర్ ద్వారా అన్నారిగూడెం ప్లాంటు నుంచి మండలంలోని 41 గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్లను సరఫరా చేయాల్సి ఉంది. కానీ ఆ నీళ్లు అన్ని గ్రామాలకు పూర్తిస్థాయిలో అందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ తాగు నీటి పైపు లైన్లు వేశారు. ట్యాంక్‌లు కూడా నిర్మించి వదిలేశారు. ఇక హుస్సేనాబాద్, బుర్కచర్ల, రావిపహాడ్ గ్రామాల్లో ఇళ్లల్లో నీటి కుళాయిలు ఏర్పాటు చేశారు కానీ భగీరథ నీటిని మాత్రం సరఫరా చేయడం లేదు. ఆయా గ్రామాలకు కేవలం గతం నుంచి వస్తున్న బోరు నీళ్లు మాత్రమే పాత పైపు లైన్ల నుంచి వస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీటిని ఇంటింటికి అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నీటిని కొనుక్కొని తాగుతున్నాం

అప్పన్నగూడెంలో మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. ఇంటింటికి నల్లాలు బిగించి వదిలేశారు. గ్రామంలో కొత్తగా వాటర్ ట్యాంక్‌లు నిర్మించారు. అసలు ఆ ట్యాంక్‌ల్లోకి నీళ్లు వస్తున్నాయో లేదో తెలియడం లేదు. ప్రైవేటు వాటర్ ప్లాంట్లల్లో 20 లీటర్ల క్యాన్‌కు రూ.10లు వెచ్చించి కొనుక్కొంటున్నాం.

– ఓరోజు నాగాచారి, అప్పన్నగూడెం

అన్ని గ్రామాలకు భగీరథ నీటిని అందిస్తాం

మండలంలోని అన్ని గ్రామాలలో మిషన్ భగీరథ పైపు లైన్‌లు వేశాం. కొన్ని గ్రామాల్లో పైపులైన్‌లు లీకేజీ, సంపు పనులు పూర్తి కాకపోవడంతో వాటర్ సరఫరా చేయడం లేదు. పనులు పూర్తయిన వెంటనే అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీటిన సరఫరా చేస్తాం.

– మణికంఠ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, మోతె

గున్నం నాగిరెడ్డి సేవలు మరువలేనివి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం దొండపాడులో రిటైర్డు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఏపీ బ్రూవరేజెస్ కార్పొరేషన్ కోఆర్డినేటర్ దివంగత గున్నం నాగిరెడ్డి విగ్రహాన్ని సోమవారం ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు అమిత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభానులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారికి కోలాట నృత్యాలతో స్వాగతం పలికి శ్రీతిరపతమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. పూజారులు వారిని శాలువాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గున్నం నాగిరెడ్డి ఒక అధికారిగానే కాకుండా, దొండపాడు గ్రామానికి ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు. టీటీడీ కల్యాణ మండపం, ఆలయ నిర్మాణం తదితర వాటిల్లో ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని వారు పేర్కొన్నారు. అనంతరం రెండు పండ్ల విభాగం ఎద్దుల పందేలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గున్నం రమాదేవి, ధర్మకర్తలు మాదవి రాజశేఖర్‌రెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి గృహలక్ష్మి, కడప లక్ష్మీరెడ్డి, ఎంపీపీ కె.వెంకటరెడ్డి, సర్పంచ్ పద్మావతి, ఎంపీటీసీ సైదిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



నాగిరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి, ఏపీ ప్రభుత్వ విప్ ఉదయభాను, గుత్తా అమిత్‌రెడ్డి

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

కోదాడరూరల్ : మండల పరిధిలోని తొగర్రాయిలో కొలువుదీరిన రుక్మిణీసత్యభామ గోదాదేవి సమేత శ్రీవేణుగోపాలస్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలకు సోమవారం అంకురార్పణ చేశారు. ఆలయంలో మామిడి తోరణాలు కట్టి నవకలశ స్నపనం, పంచామృత అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అభిషేకం అనంతరం స్వామివారికి ఆలయ ధర్మకర్తలు పట్టు వస్త్రాలు సమర్పించారు. మంగళవారం రాత్రి తిరు కల్యాణమహోత్సవ నిర్వహించబడుతుందని తెలిపారు. ఆలయ చైర్మన్ అమరనాయిని వెంకటేశ్వరరావు, సర్పంచ్ దొంగల లక్ష్మీనారాయణ, నందుల లక్ష్మీనరసింహశాస్త్రి, యాదా నరసింహరావు, మహేష్, హనుమంతరావు, ప్రభాకర్‌రావు, శ్రీనివాస్‌రావు, సింగరయ్య, బాబు ఉన్నారు.



స్వామివారికి నూతన పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ధర్మకర్తలు

మానసిక ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం

అనంతగిరి : విద్యార్థులు మానసిక ఒత్తిడితో పాటు, పరీక్షలపై భయాన్ని అధిగమిస్తేనే విజయం చేకూరుతుందని మానసిక నిపుణుడు చారుగండ్ల రాజశేఖర్ అన్నారు. జిల్లా విద్యాధికారుల ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంతో పాటు పాలారం, త్రిపురవరం, శాంతినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు మానసిక ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివితే ఎలాంటి క్లిష్ట పరిస్థితులనైన అధిగమించొచ్చని అన్నారు. వివిధ అంశాలలో కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అందిపుచ్చుకుంటే పురోగతి కనిపిస్తుందన్నారు. అదేవిధంగా వైఫల్య గాథలు, మానసిక ప్రశాంతత, సమయపాలన, పుస్తక పఠనం, ఆత్మవిశ్వాసం, పరిపూర్ణత సాధన మార్గాలు, యోగా వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్ఎంలు భారతి, లింగారెడ్డి, తల్లాడ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సుకన్య, శ్రీనివాసరావు, గఫ్ఫార్, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర భవనాన్ని కూల్చాలని ఫిర్యాదు

నేరేడుచర్ల : నేరేడుచర్లలోని జాన్‌పహాడ్ రోడ్డు మూలమలుపులో ప్రమాదకరంగా ఉన్న ఈగ నాగేశ్వర్‌రావు భవనాన్ని కూల్చివేయాలని యర్రంశెట్టి జానయ్య, చిట్టిపోలు ఉపేందర్ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో తహసీల్దార్ సరితకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు వెడల్పులో భాగంగా నాగేశ్వర్‌రావు భవనాన్ని సగం వరకు కూల్చారని, మిగిలింది అలాగే వదిలేశారని, దీంతో భవనానికి ఫిల్లర్స్ లేకపోవడంతో ప్రమాదకరంగా ఉండి ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రమాదం జరగకుముందే తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం



మాట్లాడుతున్న మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లీశ్వరి

హుజూర్‌నగర్ : ప్రస్తుత సమాజంలో మహిళల పాత్ర అత్యంత కీలకమైనదని మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లీశ్వరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హుజూర్‌నగర్‌లోని జంగిడి సెంటర్‌లో సమాఖ్య ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. తొలుత సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు పశ్య పిచ్చమ్మ మహిళా సమాఖ్య జెండా విష్కరించారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకురాళ్లు చింతకుంట్ల విజయ, సుందరి పద్మ, యల్లావుల సీత, సోమగాని లక్ష్మమ్మ, పాలకూరి మమత, సైదమ్మ, ఫాతిమా, అరుణ, శైలజ, సక్కు, మంగమ్మ, లక్ష్మమ్మ, సరోజినమ్మ పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం



నేరేడుచర్ల : స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఎల్. శ్రీనివాస్‌రావు, హెచ్ఎం వి.రమేష్, యాజమాన్య కమిటీ చైర్మన్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, విజయ, భూదేవి, సిబ్బంది ఫాతిమా, శ్రీను తదితరులున్నారు.



మోతె : సిరికొండ ఉన్నత పాఠశాలలో..

సిరికొండ ప్రభుత్వ పాఠశాలలో..

మోతె : మండల పరిధిలోని సిరికొండ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మారి ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయులు శ్రీను, ఉపాధ్యాయులు శ్రీనివాసాచారి, రాంబాబు, కిరణ్, సూరయ్య, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి

మఠంపల్లి : అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్న బీఆర్ఎస్ పార్టీని రానున్న ఎన్నికల్లోనూ గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య కోరారు. సోమవారం మండలంలోని చౌటపల్లి, వరదాపురం గ్రామాల్లో లబ్ధిదారులు ఐదుగురికి రూ.1. 77 లక్షలు విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. అలాగే యాతవాకిల్లలో నలుగురు లబ్ధిదారులకు మంజూరైన రూ.1. 10 లక్షల విలువైన చెక్కులను సర్పంచ్ కోలాహలం లక్ష్మీనరసింహరాజుతో కలిసి వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కె.లక్ష్మీవెంకటనారాయణ, సర్పంచ్ కళ్యాణినరేష్, ఉపసర్పంచ్ నాగలక్ష్మి, హఫీజ్‌ఖాన్, రవీందర్ నాయక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పల్లె మట్టయ్య, బత్తుల సైదయ్య, దొండపాటి కృష్ణయ్య, రమణారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు యల్లావుల నాగయ్య యాదవ్, కాశయ్య, నాగులు, నాగయ్య, జ్యోతిలింగరాజు, ప్రకాష్, శ్రీను, బాల నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

వస్త్రదానం అభినందనీయం : ఎమ్మెల్యే



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

మునగాల : పేదలకు ఉచితంగా వస్త్రదానం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మండలంలోని రేపాల శివారులో గల స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఆలయ ఆవరణలో మండలంలోని నరసింహాపురం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు దాతలు చేపట్టిన ఉచిత వస్త్రదానం కార్యక్రమంలో ఆయన పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వస్త్రదానంకు సహకరించిన ఖానాపురం సర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాసరావు, కోదండరామాపురం సర్పంచ్ దేవరకొండ రమేష్,, ప్రముఖ రంగస్థల నటుడు డా.గుంటిపల్లి పిచ్చయ్యలను ఆయన సత్కరించారు. కాగా సీతానగరం, విజయరాఘవపురం, రేపాల గ్రామాలకు చెందిన సుమారు 200 మంది వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు వస్త్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లి రమణ, ఎంపీటీసీ సొంపంగు మోహన్, ఆలయ కమిటీ చైర్మన్ పానుగోటి రంగా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, మండల నాయకులు అజయ్‌కుమార్, శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, వెంకటరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మోతె : రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీతిరుపతమ్మ గోపయ్యల కల్యాణ మహోత్సవం, తుమ్మగూడెంలో యలమంచమ్మ జాతరలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి గోదావరి జలాలపై చర్చించారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శీలం సైదులు, సర్వారం ఎంపీటీసీ ఉపేంద్రశ్రీనివాస్, తుమ్మగూడెం సర్పంచ్ నర్సిరెడ్డి, మాజీ ఎంపీపీ లింగారెడ్డి, రామకోటయ్య పాల్గొన్నారు.

కబడ్డీలో దేశానికి మంచి పేరు తేవాలి

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



జాతీయ క్రీడాకారిణి త్రివేణిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : కబడ్డీ క్రీడలో ఉత్తమ ప్రతిభ కనబరిచి దేశానికి మంచి పేరు తేవాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. జాతీయ కబడ్డీ జట్టుకు ఎంపికై నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ కబడ్డీ టోర్నమెంట్‌లో ఆడనున్న గానుగబండకు చెందిన క్రీడాకారిణి రెడపంగు త్రివేణిని సోమవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సైదిరెడ్డి ఘనంగా సన్మానించి రూ.25 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలకు, క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. అనంతరం మఠంపల్లి మండల నాయకులు బేత శివారెడ్డి జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వి. యల్లయ్య, మహబూబ్ అలీ, టి.నరేష్, పి.సుధాకర్, బి.సతీష్, ఎస్.ఉస్మాన్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ప్రోత్సాహం..

జాతీయ కబడ్డీ జట్టుకు ఎంపికైన రెడపంగు త్రివేణిని ఏఎంసీ మాజీ చైర్మన్ కడియం వెంకటరెడ్డి, ఎంపీటీసీ కడియం స్వప్న అభినందించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దొండపాడులో ఘనంగా జాతర



హుజూర్‌నగర్ : దొండపాడులో ఎద్దుల పందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం దొండపాడులోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణ మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో మంచి నీటి సరఫరా, అన్నదానం ప్రారంభించారు. అనంతరం టచ్ పండ్ల విభాగం ఎద్దుల పందేలను ఎమ్మెల్యే లాంఛనంగా ప్రాంభించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, చైర్ పర్సన్ గున్నం రమాదేవి, ధర్మకర్త విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ కె.వెంకటరెడ్డి, సర్పంచ్ పద్మావతి, ఎంపీటీసీలు, నిర్వాహకులు, స్థానిక నాయకులు, గ్రామపెద్దలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

రేబల్లెలో కల్యాణ మహోత్సవాలు ప్రారంభం

చింతలపాలెం మండలంలోని రేబల్లె గ్రామంలోని శ్రీశారదా చంద్రమౌళీశ్వర, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో కల్యాణోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో అంకురార్పణ, విఘ్నేశ్వర పూజ, ధ్వజారోహణం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

లింగమంతులస్వామికి నెలవారం పూజలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని అమరవరంలో లింగమంతులస్వామి జాతర పూర్తయి నెల రోజులు కావడంతో సోమవారం నెలవారం పూజలను వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సైదిరెడ్డి రజితా దంపతులు ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి గతంలో రూ.30 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి మరో రూ. 25 లక్షలు కూడా మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ సైదిరెడ్డి, సర్పంచ్ సుజాతాఅంజిరెడ్డి, బాల సైదులు, అన్నెం శౌరెడ్డి, వెంకటరెడ్డి, లింగారెడ్డి, వెంకటేశ్వర్లు, మట్టారెడ్డి, ఆలయ చైర్మన్, వైస్ చైర్మన్‌లు మట్టయ్య, లింగరాజు, కృష్ణ, కోటిరెడ్డి, తదితరులున్నారు.

తీపి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ..



చిలుకూరు : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



కోదాడ బాలికల పాఠశాలలో..

చిలుకూరు : చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994– 98వ సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం స్థానిక కుషీనగర్ వెంచర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరవేసుకుని సరదాగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లుగా తెలిపారు.

బాలికల ఉన్నత పాఠశాలలో..

కోదాడ : పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 1981– 85 సంవత్సరంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసించిన విద్యార్థులు సోమవారం 38 సంవత్సరాల తరువాత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి గురువులు సూర్యప్రకాశ్‌రావు, పద్మావతి, వేనేపల్లి శ్రీనివాసరావులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మకుమారి, అరుణ, నాగలక్ష్మి, విజయలక్ష్మి, రాధా, ప్రమీల పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు హైదరాబాద్ నారాయణ విద్యా సంస్థలు అందజేసిన స్టడీ మెటీరియల్‌ను సోమవారం ఆ పాఠశాల హెచ్ఎం బట్టు మధు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, శ్రీదేవి, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్, అశోక్‌కుమార్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలకు స్థలాల పరిశీలన

నడిగూడెం : మండల పరిధిలోని చాకిరాల, శ్రీరంగాపురం గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు సోమవారం ఎంపీడీఓ యం.యర్రయ్య స్థలాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఓ ఎర్ర.లింగారెడ్డి, ఆర్ఐ కొండపల్లి గోపాలకృష్ణ, సర్పంచ్‌లు ఎల్.నాగేశ్వరరావు, వీరస్వామి తదితరులున్నారు.

ఉత్తమ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు

హుజూర్‌నగర్ : ఉత్తమ సేవలు అందించడంతో ఉద్యోగులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని కౌన్సిలర్ కస్తాల శ్రావణ్‌కుమార్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని 11వ వార్డులో కంటి వెలుగు శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ సుష్మ, మల్లిక, శివకృష్ణ, హైమావతి, రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

మొక్కలను ఏపుగా పెంచాలి

మఠంపల్లి : మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కలను ఏపుగా పెంచాలని ఎంపీడీఓ జానకిరాములు అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో గల నర్సరీలను పరిశీలించి మాట్లాడారు. ఎంపీఓ ఆంజనేయులు, సర్పంచ్ పాండునాయక్, టీఏ నరసింహ తదితరులున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని తెలంగాణ మైనార్టీ పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు పస్తుత సమాజంలో స్త్రీల ప్రాముఖ్యత, అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఉద్దేశం అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రెహానాబేగం, సీడీపీఓ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ సోమమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

కీతవారిగూడెంలో పాట చిత్రీకరణ

గరిడేపల్లి : సాంఘిక దురాచారాలపై మండలంలోని కీతవారిగూడెంలో ప్రజా కళాకారుడు బాదే నర్సయ్య సోమవారం పాట చిత్రీకరించారు. దీప్తి, శాంతిప్రియ, చైతన్య, ధరావత్ నాయక్ పాల్గొన్నారు.

కంటి వెలుగు.. పేదల జీవితాల్లో వెలుగు

అనంతగిరి : కంటి వెలుగు కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని పాలారం తండాలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ లలితాశ్రీనుబాబు, ఎంపీటీసీ సంధ్యాసైదులు, ఎంపీఓ జగదీష్, వైద్యులు, కార్యదర్శి, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వాచ్‌ఉమెన్‌కు సన్మానం

హుజూర్‌నగర్ : పట్టణంలోని గురుకుల బాలికల పాఠశాలలోకి శనివారం రాత్రి చొరబడిన వ్యక్తిని చాకచక్యంగా పట్టుకున్న వాచ్‌ఉమన్ మమతను సోమవారం ప్రిన్సిపాల్ అనిత, సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఏటీపీ మీరాబీ, ఉపాధ్యాయులు రేణుక, త్రివేణి, కవిత, సఫియ, అరుణ, శోభారాణి, ఉషారాణి, క్రిష్ణవేణి, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణికి రక్తదానం

హుజూర్‌నగర్ : మేళ్లచెరువు మండలం ఎర్రగ్రడ్డ తండాకు చెందిన గర్భిణి కళ్యాణికి రక్తం అవసరం కావడంతో హుజూర్‌నగర్‌కు చెందిన డీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన కొల్లపూడి వినయ్ సోమవారం రక్తదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ దగ్గుపాటి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ్ సహకారంతో గ్రామాలు అభివృద్ధి

పాలకవీడు : ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో మండలంలోని గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీపీ భూక్యా గోపాల్ అన్నారు. మండల కేంద్రంలో రూ.8 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సోమవారం సర్పంచ్ నాగలక్ష్మీతో కలిసి ప్రారంభించారు. ఎంపీటీసీ ఉపేందర్, సర్పంచ్ మోతీలాల్, కార్యదర్శి జ్యోతి, నాయకులు పాల్గొన్నారు.

గరిడేపల్లిలో కోమటిరెడ్డి దిష్టిబొమ్మ దహనం



వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న గౌడ యువజన సంఘం నాయకులు

గరిడేపల్లి : తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ చెరుకు సుధాకర్‌గౌడ్ కుమారుడు సుహాస్‌గౌడ్‌కు ఫోన్ చేసి చెరుకు సుధాకర్‌ను తన అభిమానులు వారం రోజుల్లో చంపుతారని తీవ్ర పదజాలంతో బెదిరించిన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని గౌడ యువజన సంఘాల నాయకులు కోరారు. సోమవారం గరిడేపల్లిలో వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసి మాట్లాడారు. గౌడ యువజన సంఘం నాయకులు చామకూరి అంజి, అనంత్ కరుణాకర్, మహేష్, నవీన్, వెంకన్న, శివ, నాగరాజు, ఉదయ్, ప్రశాంత్, ఉమేష్ అరవింద్ పాల్గొన్నారు.